బాణాసంచా దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి-చెన్నూరు

మండల కేంద్రమైన చెన్నూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలపై కడపకు చెందిన జిఎస్‌టి అధికారులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ప్రతి షాపునూ తనిఖీ చేశారు. బాణాసంచా కొనుగోలుకు సంబంధించి పత్రాలు పరిశీలించారు. అందులో జిఎస్‌టి సంబంధించిన బిల్లులు లేకపోవడంతో , ఎందుకు కట్టలేదని యజమానులను ప్రశ్నించారు. 11 షాపులకు సంబంధించి యజమానుల నుంచి జిఎస్‌టి వసూలు చేశారు. కాగా మండల వ్యాప్తంగా దీపావళి పండుగను రెండు రోజులపాటు ప్రజ లు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఇంటి ఎదుట దీపాలు వెలిగించి బాణా సంచా పేల్చారు. మండలంలోని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. పిల్లలు పెద్దలు ప్రతి ఇంటి ఎదుట బాణా సంచా కాల్చి తమ ఆనందం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న వర్షాభావం

జిల్లాలో తీవ్ర వర్షాభావం కొనసాగుతోంది. జిల్లాలోని 36 మండలాల్లో భారీగా లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలో ఎక్కడ సాధారణ వర్షపాతం నమోదైన దాఖలాల్లేవు. దీనికి పైపెచ్చు అక్టోబర్‌లో డ్రైస్పెల్ నమోదు కావడం రబీ సీజన్ సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయని చెప్పవచ్చు. ఈలెక్కన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్‌లు వరుసగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో 87 శాతం విస్తీర్ణంలో విత్తనం పడని పరిస్థితి కనిపిస్తోంది.

పొంచి ఉన్న డ్రైస్పెల్ గండం

రబీ సాగు 48,505 ఎకరాలే

జిల్లాలో 13.4 శాతమే సాగు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో రబీ సీజన్ కథ కంచికి చేరినట్లు కనిపిస్తోంది. 2022-23 రబీలో 3,72,050 ఎకరాల్లో సాగు చేయాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. అక్టోబర్ ఒకటి నుంచి డిసెంబర్ వరకు విత్తనం వేయాల్సి ఉంది. అక్టోబర్, నవంబర్ మాసాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేఢ్యంలో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. అక్టోబర్ నుంచి నేటి వరకు 7.8 శాతానికి మంచి వర్షపాతం నమోదు కాని నేపథ్యం విస్మయాన్ని కలిగిస్తోంది. రబీ సీజన్ ప్రారంభం నుంచి నేటి వరకు 48,505 ఎకరాల్లోనే విత్తనం పడినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది ఇదేసమయానికి సుమారు 70 వేల ఎకరాల్లో విత్తనం పడినట్లు తెలుస్తోంది. ఈలెక్కన జిల్లాలో మరో 3,23,545 ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉంది. ఈలెక్కన రబీ సాగు తీరుతెన్నులను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది.

భయపెడుతున్న డ్రైస్పెల్స్

జిల్లాలో డ్రైస్పెల్స్ గండం పొంచి ఉంది. అక్టోబర్ మాసంలో 23.6 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఆశించిన వర్షపాతం నమోదు గాకపోవడం గమనార్హం. రబీ సీజన్ ప్రారంభ మాసమైన అక్టోబర్‌లో తొలి డ్రైస్పెల్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లోనూ ఇదేతరహా పరిస్థితి ఎదురైన సంగతి తెలిసిందే. డ్రైస్పెల్ నమోదైన అనంతరం 7.8 శాతం మాత్రమే వర్షపాతం నమోదు కావడం గమనార్హం. రబీ సాగులో ప్రాధాన్యత కలిగిన నవంబర్ మాసంలోనూ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నవంబర్‌లో 118 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, రెండవ వారంలోకి చేరుతున్న నేపథ్యంలో 7.7 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదు కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. డిసెంబర్ నెలాఖరు వరకు నమోదు కానున్న వర్షపాతం తీరుతెన్నులు సాగు లక్ష్యాన్ని నిర్దేశించనుంది. రబీ సీజన్ ఆందోళనకర స్థాయిలో లోటు వర్షపాతం నమోదు కావడం రైతాంగాన్ని నిరాశ ఆవరించింది. జిల్లావ్యాప్తంగా తీవ్ర దుర్భిక్ష వాతావరణ పరి స్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో రబీ సీజన్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పాలకులకు కనిపించని కరువు

జిల్లాలో 17 మండలాల్లో కరువు తాండవం చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ మొదలుకుని రబీ సీజన్ మధ్యస్థ దశ వరకు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం జిల్లాలోని 36 మండలాల్లో 17 మండలాల్లో కరువు పరిస్థితులు ఆందోళన కలిగి స్తున్నాయని ప్రతిపాదనలు అందజేసింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఆలస్యంగా మేల్కొంది. కడప జిల్లాలో ఏ ఒక్క మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. రబీ సీజన్ ప్రారంభమై రెండో నెల గడుస్తున్నప్పటికీ ఖరీఫ్ తరహా దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

రబీ సాగుపై నీలినీడలు

రబీ సీజన్‌లోని 20 రకాల పంటలు సాగవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఏఒక్కటీ పూర్తి స్థాయిలో సాగుకు నోచుకునే అవకాశాలు లేవనే సందేహం కలుగుతోంది. చివరికి వర్షాధార పంటలైన కొర్రలు, అరికెలు, సోమలు, వరిగ, ఊదలు వంటి సిరిధాన్యాలపై సందేహాలు ముప్పిరి గొన డం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిల్లా సాగు విస్తీర్ణమైన 3,72,505 ఎకరాల సాగు లక్ష్యంలో ప్రధాన పంటలైన వరి 26,673 ఎకరాలు, బుడ్డశనగ 2,32,360 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 3,352 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడినట్లు తెలుస్తోంది. జొన్న 10,145 ఎకరాలు, వేరుశనగ 1755 ఎకరాలు, మినుములు 30,677 ఎకరాల్లో సాధారణ సాగుకు నోచుకోవడం గమ నార్హం. ఇం దులో మినుముల సాగు మాత్రమే లక్ష్యానికి మంచి 122 శాతం సాగు కావడం గమనించాల్సిన విషయం.

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తాం

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆశిస్తున్నాం. నవంబర్‌లో వర్షపాతం నమోదును బట్టి సాగు పరిస్థితిని అంచనా వేయవచ్చు. ఇప్పటికి 13.4 శాతం విస్తీర్ణంలో మాత్రమే విత్తనం పడింది. డిసెంబర్ నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమిస్తామని ధీమాను వ్యక్తం చేయడం గమనార్హం.

- నాగేశ్వరరావు, అగ్రికల్చర్ జెడి. కడప.

ఆర్‌డి బదిలీ యత్నం!

- చక్రం తిప్పుతున్న రాష్ట్ర ఉన్నతాధికారి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ రత్నకుమారి బదిలీ కానున్నారా అంటే అవుననే సమాధానమే లభిస్తోంది. ఈమెను బదిలీ చేయించడానికి రాష్ట్ర కేంద్రానికి చెందిన ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఇటీవల ఆయన కడప, తిరుపతి పర్యటనల సందర్భంగా మంత్రాంగం నెరపినట్లు తెలిపింది. ఈనెలాఖరులో రిటైర్డు కానున్న నేపథ్యంలో జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖపై పట్టు పెంచుకునే ప్రయత్నంలో భాగంగా ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్‌డి సైతం ఆరోగ్య కారణాల రీత్యా విశాఖపట్నం రీజినల్ డైరెక్టర్‌గా బదిలీకి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె స్థానంలో కర్నూలు జిల్లాకు చెందిన ఉన్నతాధికారిని రీజినల్ డైరెక్టర్‌గా నియమించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. రిటైర్డ్ అనంతరం వైద్య ఆరోగ్య శాఖపై తనదైన పట్టు సడలకుండా ఉండాలనే ఉద్దేశంతో వ్యవరిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఇటీవలి కౌన్సెలింగుల్లో చోటుచేసుకున్న గైడ్‌లెన్స్ ఉల్లంఘనల్ని సైతం చూసీచూడనట్లు వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. బదిలీ యత్నంపై ఆర్‌డిని సంప్రదించగా తలూపుతూనే ఇది తన పర్సనల్ వ్యవహారమని ముక్తాయింపును ఇవ్వడం గమనార్హం. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇటువంటి అపసవ్య ధోర ణులపై మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఆ పార్టీలకు బిజెపిని ప్రశ్నించే ధైర్యం ఉందా?

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ప్రశ్నించే సాహసం వైసిపి, టిడిపి జనసేన చేయడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పాత బస్టాండ్ లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న 'చలో విజయవాడ ప్రజా రక్షణ భేరి' లక్ష మందితో నిర్వహించే "బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు నాలుగు నెలల్లో రానున్నాయని పేర్కొన్నారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అవకాశవాద రాజకీయ ఎత్తుగడలు అవలంభిస్తున్నాయని తెలి పారు. ప్రజల సమస్యలపై అజెండా, రాష్ట్రంలో అసమానతలు లేని సమగ్రాభివృద్ధి, కేంద్రం రాష్ట్రానికి చేసిన ద్రోహంపై ఎన్నికల ప్రణాళికలో మూడు పార్టీలకు లేవని తెలిపారు. దేశంలో బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం రాజకీయ విలువలను నడి బజారులో ఇప్పేస్తున్న రాష్ట్రంలోని అధికార వైసిపి ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించ కుండా ఉందో ప్రజలందరూ ఆలోచించాలన్నారు. బిజెపి బాటలోనే వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో నియంతృత్వ పోకడలతో పాలిస్తోందని విమర్శిం చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోడీ, అమిత్ షా, నడ్డా నాయకత్వంలోని కేబినెట్ మంత్రులు, దేశంలోని ప్రతిపక్ష పార్టీల నాయకులను, ప్రాంతీయ పార్టీల నాయకులను భయపెట్టి కేంద్ర ప్రభుత్వ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలైన ఐటి, సిబిఐ, ఈడి దాడులు చేస్తామని బెదిరిస్తూ బిజెపిలోకి చేరమని థాయిలాలు చూపుతున్నారన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలైన ఏడు రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు బిజెపిలో గుత్త మొత్తంగా చేరిన ఉదాంతాలు దేశం ముందుకు వచ్చి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేనలను కూడా ఆ పద్ధతుల్లోనే భయపెట్టి రాష్ట్రంలో చాపకింద నీరు లాగా బిజెపి బలపడుతుందని హెచ్చరించారు. బహిరంగ సభకు జిల్లా నుంచి వందలాది మంది ప్రజలు వెళ్ళనున్నారని తెలిపారు. సభకు అఖిలభారత సిపిఎం కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాలు ప్రజా సమస్యలపై ప్రధాన అజెండాగా ఉండేలా 'ప్రజాస్వామ్య వేదిక' ఏర్పాటుకు ప్రజలందరూ సహకరించేందుకు ప్రజా చైతన్యం సిపిఎం కల్పిస్తుందని చెప్పారు. బిజెపిని, దాని మిత్రులను ప్రజలు దూరంగా పెట్టేందుకు నిర్ణయించేకునేలా ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నానికి రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య మేధావులు, లౌకిక , ప్రజాస్వామ్య, సామ్యవాద, మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేసే ప్రజాసంఘాలు సహకరించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఏ.రామ్మోహన్, కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

సిపిఎం మాజీ ఎంపీ మృతి పట్ల సంతాపం

కడప అర్బన్ : సిపిఎం మాజీ ఎంపీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (రైల్వేస్) మాజీ చైర్మన్ బాసుదేవ ఆచార్య సోమవారం దీర్ఘకాలిక అనారోగ్యంతో హైదరాబాదులో మరణించారు. ఆయన మృతి పట్ల ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కడప డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవధానం శ్రీనివాస్, రఘునాథ రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో బాన్కురా పార్లమెంట్ స్థానం నుంచి సిపిఎం తరపున 8 సార్లు గెలిచారని పేర్కొన్నారు. ఎక్కడా దర్పం, హంగామా లేకుండా ప్రజల్లో మమేకమై, సమస్యలు అర్థం చేసుకుని, పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) నిర్వహించిన అనేక సమావేశాల్లో, కార్యక్రమాలలో ఆయన చురుగ్గా పాల్గొనేవారిని పేర్కొన్నారు. సిఐటియు నివాళి.. బాసుదేవ్ ఆచార్య మృతికి సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి మనోహర్ జోహార్లు అర్పించారు. వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. లోక్‌సభకు ఏడు సార్లు వరుసగా ఎన్నికై ప్రజా సమస్యల మీద చట్ట సభల్లో ప్రభుత్వాన్ని నిలదీసి పరిష్కారాలు సాధించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం పునరంకితమవుతామన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-చెన్నూరు

వీరనారాయణ నాగిరెడ్డి

కడప యుటిఎఫ్ భవన్‌లో మండల అధ్యక్షులు పి. శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన చెన్నూరు మండల యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి శ్రీనివాసులు, అధ్యక్షులుగా ములపాకు నాగిరెడ్డి, సహాధ్యక్షులుగా పి పార్థసారథి, ఎస్.షకీలా, ప్రధాన కార్యదర్శిగా ఏ వీర నారాయణ, ట్రెజరర్‌గా ఎస్.ఖాదర్ బాషా, మండల కార్యదర్శులుగా కె.వెంకటేశ్వర్‌రెడ్డి, సి జయరాజు, బషీర్ అహ్మద్, సి.సుబ్బరాయుడు, సునీత, నాగ భారతి, జిల్లా కౌన్సిలర్లుగా జె. భాస్కర్, డి.నాగేశ్వరరావు, ఎ. రంగనాయకులు, మునెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా ట్రెజరర్ కె నరసింహారావు వ్యవహరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న బండి జకరయ్య

ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో కేంద్రంలోని బిజెపి , రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు రెండూ పూర్తిగా విఫలం చెందాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఏ. సత్తార్ ఘాటుగా విమర్శించారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి దేశంలో తిరిగి పూర్వ వైభవం రాబోతుందని అన్నారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాలు, 2024లో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దళితులు, పేదలు, అన్ని వర్గాలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్ అన్నారు. దీన్ని ప్రజలు ఇప్పుడు పూర్తిగా నమ్మి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కి కక్ష సాధింపు రాజకీయాలు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారన్నారు. మద్యం ధరలు రెండంతలు పెంచి పెనుభారం మోపారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దాసోహమై రాష్ట్రానికి కావాల్సిన ప్రత్యేక హోదాను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకురాలేకపోయరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలన్నిటిని తప్పక నెరవేరుస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రతి ఒక్కరి అకౌంట్లో 15 లక్షలు వేస్తామని చెప్పి దేశ ప్రజలందరినీ మోసం చేసిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కులాలను, మతాలను, ప్రాంతాలను విభజించి మోడీ ప్రభుత్వం ఆప్రజాస్వామికంగా సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సమావేశంలో హరిప్రసాద్, కదిరి ప్రసాద్, రత్నం పాల్గొన్నారు.

ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -కడప అర్బన్

లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో నగరంలోని అల్ హబీబా విద్యాసంస్థల ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ జిల్లా అధ్యక్షులు పోతుల వెంకట్రామి రెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, కోశాధికారి దేవతి రవీంద్రనాథ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విద్యావేత్త కె. అక్బర్ ఖాన్ ప్రారంభించారు. ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని నాగరవితేజ ఆయుర్వేదిక్ మందుల షాపు నిర్వాహకులు గుంటి విజయ్ కుమార్ బాబు సౌజన్యంతో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ టి.రవికుమార్ దాదాపు 80 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారందరికీ మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయుర్వేద ఔషధాల పనితీరు గురించి వివరించారు. ఈ మందులు సంప్రదాయ వైద్యంలో భాగమని తెలిపారు. ప్రజల కోరిక మేరకు త్వరలో మరొక శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు విజయ్ కుమార్ బాబు తెలిపారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్ భట్టర్, లయన్స్ క్లబ్ సభ్యులు కె. సంజీవ రెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, బి. కొండారెడ్డి, కిరణ్, కోటేశ్వరరావు, మెడికల్ రెప్‌లు రాజశేఖర్, లోకేష్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దాచుకున్న సొమ్ము దోచుకుంటున్న ప్రభుత్వం : యుటిఎఫ్

కడప అర్బన్ : ఉపాధ్యాయులు ప్రావిడెంట్ ఫండ్ రూపంలో దాచుకున్న డబ్బులను ప్రభుత్వం దోచుకుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు సోమవారం యుటిఎఫ్ భవన్‌లో ప్రాంతీయ మండలాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యక్తిగత అవసరాల నిమిత్తం ప్రతినెలా జీతంలో పొదుపు రూపంలో దాచుకున్న పిఎఫ్ సొమ్మును ప్రస్తుతం అనారోగ్యం ఇతరత్రా సమస్యల కారణంగా వాడుకోవడానికి అవకాశం లేకుండా గత మార్చి నుంచి ఒక్క రూపాయి కూడా విదల్చకుండా ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల దారుణంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఏపీ జిఎల్ఐ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు పూర్తిగా అందని ద్రాక్ష లాగా మారిపోయాయని తెలిపారు. దసరా, దీపావళి సందర్భంగానైనా వాటిని మంజూరు చేస్తారని కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూసిన ఉపాధ్యాయులు బకాయిలు రాకపోవడంతో వారి ఆశలపై నీళ్ల చల్లినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ సొమ్ములను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు చంద్రశేఖర్, వీరనారాయణ, శ్రీనివాసులు, నాగిరెడ్డి, గోపీనాథ్, శివరామకృష్ణమరాజు పాల్గొన్నారు.

నేడు చిత్రలేఖనం బహుమతుల ప్రదానోత్సవం

కడప అర్బన్ : బాలోత్సవం చిత్రలేఖనం పోటీల బహుమతి ప్రదానోత్సవం ఈనెల 14న బాలల దినోత్సవ సందర్భంగా ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో సాయంత్రం మూడున్నర గంటలకు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కమిటీ నాయకులు బి.లక్ష్మీరాజా, బి.రాజశేఖర్ రాహుల్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనం మూడు విభాగాల పోటీలుంటాయన్నారు. మొదటి విభాగం మూడు, నాలుగు, ఐదు తరగతులు, రెండవ విభాగం ఆరు, ఏడు తరగతులు, మూడవ విభాగం 8, 9, 10 తరగతుల వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతి విభాగంలోనూ 15 కన్సోలేషన్ బహుమతులు ఇవ్వటం ఇస్తామని తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

కార్తీక మాస మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తొగటవీర క్షత్రియ నాయకులు

తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను సోమవారం కడప నగరం ఎర్రముక్కపల్లిలోని శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ ఆవర ణంలో ఆ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవాధ్యక్షులు గోవిందు నాగరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఆనవాయితీగా తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవాని కార్యక్రమాన్ని డిసెంబర్ నెల 10వ తేదీ ఆదివారం రాజంపేట రోడ్డు కనుమలోపల్లి వద్దగల 108 శివలింగాల మహా శివలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉదయం 10:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గటవీర క్షత్రియ కుల బాంధవ్యులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం సందర్భంగా పిల్లలకు, పెద్దలకు, మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో విజేతలైన వారికి బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పల్లా బాలచౌడన్న, ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, గోవిందు వెంకటరమణ, ఉపాధ్యక్షులు బొలిశెట్టి వెంకటస్వామి, బండి కృష్ణయ్య, కొరకూటి వెంకటసుబ్బన్న, కార్యవర్గ సభ్యులు టేకూరి పుష్పాంగధ, సుంకర శివశంకర్ పాల్గొన్నారు.

ఒకే రోజు రెండు దారుణ హత్యలు

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు హతం

ఉలిక్కిపడ్డ కడప నగర వాసులు

పండుగ పూట రెండు కుటుంబాల్లో విషాదం

ప్రజాశక్తి-కడప అర్బన్

రెండు దారుణ హత్యలతో కడప నగర ప్రజలకు ఉలిక్కిపడ్డారు. ఒకే రోజు ఇరువురు వ్యక్తులు దారుణ హత్యలకు గురయ్యారు. దీపావళి పండుగ పూట హత్యలు చోటు చేసుకోవడంతో బాధిత కుటుంబాల్లో విషాదం నెలకొన్నాయి. కడప నగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ న్యూ కలెక్టరేట్ సమీపంలోని ఎల్ఐసి క్వార్టర్స్ సముదాయంలో ఆదివారం భవాని.శంకర్ (37) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మరో ఘటనలో చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గురుకుల్ విద్యాపీఠ్ సమీపంలో ఆదివారం సాయికిరణ్ (28) అనే వ్యక్తి హత్యకు గుయ్యాడు. ఈరెండు హత్యలకు సంబంధించిన వివరాలు..

కడప నగరం న్యూ కలెక్టరేట్ సమీపంలోని ఎల్ఐసి క్వార్టర్స్ వద్ద వాలీంటర్ భవానీ శంకర్‌ను తోటి స్నేహితుడే మచ్చు కత్తితో దారుణంగా పొడిచి చంపాడు. మృతుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిరంజన్ నగర్ 14వ డివిజన్ వాలంటీర్‌గా పనిచేసేవాడు. దీంతోపాటు ఎల్ఐసి కార్యాలయంలో డిజిటలైజేషన్ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహించేవాడు. భవానీ శంకర్‌కు అక్కడే పనిచేస్తున్న టీమ్ లీడర్ మల్లికార్జున మంచి స్నేహితుడు. ఇటీవల వివాహేతర సంబంధం విషయంలో వారికి మనస్పర్థలు వచ్చాయి. తారాస్థాయికి చేరడంతో పథకం ప్రకారం మల్లికార్జున, భవానీ శంకర్‌కు ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఫోన్ చేసి ఎల్ఐసి కార్యాలయం వద్దకు రావాలని పిలిచాడు. భవానీ శంకర్ రాగానే అప్పటికే అక్కడికి చేసుకున్న మల్లికార్జున ఆటో డ్రైవర్, ఎల్ఐసిలోనే స్కానింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న రంజిత్‌లో కలిసి మచ్చుకత్తితో

హత్యకు గురైన సాయికిరణ్, రక్తపు మడుగులో భవానీ శంకర్

మెడపై దాడి చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి ఎం.డి. షరీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరారీలో ఉన్న మల్లికార్జున కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని భావిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో అప్పు తీసుకుని తిరిగి ఇవ్వమని అడిగినందుకు ఒక యువకుడిని దారుణంగా హతమార్చారు. చిన్నచౌక్ పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కడప నగరంలోని చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన సాయి కిరణ్ (28) ఓ ప్రయివేట్ షో రూంలో పనిచేస్తున్నాడు. అతను మహేష్ అనే వ్యక్తికి మూడు నెలల కిందట రూ.50వేలు అప్పుగా ఇచ్చాడు. ఈ విషయమై ఆదివారం రాత్రి చిన్నచౌక్ పాత బైపాస్ వద్ద వాగ్వివాదానికి దిగారు. పండగ పూట తనను అప్పు అడిగినందుకు ఆగ్రహించిన మహేష్ తన వద్ద ఉన్న కత్తి తీసుకుని సాయికిరణ్ కడుపులో బలంగా పొడిచాడు. తరువాత అతడే సాయి కిరణ్‌ను ను తన వాహనంలోనే ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో భయాందోళనకు గురైన మహేష్ పోలీసులకు లొంగి పోయాడు. కిరణ్ మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి రమణయ్య ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

26న ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

బాపట్లలోని కాపు కల్యాణ మండపంలో ఈ నెల 26న నిర్వహించే ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పిలుపునిచ్చారు. సోమవారం బాపట్లలోని ఎన్‌జిఒ హోమ్‌లో ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమావేశానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా ముస్లింలు అవగాహన కల్పించేందుకు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం ముస్లిములకు కల్పించిన హక్కులు, సంక్షేమం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముస్లిములను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఓట్లు మావే- సీట్లు మావే అని నినాదంతో ముస్లిం ఐక్యవేదిక పనిచేస్తుందని పేర్కొన్నారు. దామాషా ప్రకారం ముస్లిములకు రావాల్సిన హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ పులి, గౌరవ అధ్యక్షులు జియావుల్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం, ముస్లిం ఐక్యవేదిక నాయకులు సలావుద్దీన్, బాజీ, ఖలీల్ సయ్యద్, సయ్యద్ నూర్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ముస్లిమ్ ఐక్యవేదిక నాయకులు

మాదిగల సామాజిక న్యాయ మహాసభ

కడప అర్బన్ : ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా డిసెంబర్ 7న మాదిగల సామాజిక న్యాయ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం బాపిరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కొట్టం మనోహర్ తెలిపారు. సోమవారం వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని అనుమోలు గార్డెన్స్‌లో మహాసభ ఉంటుందని తెలిపారు. మూడు గంటలకు ర్యాలీ నాలుగు గంటలకు సభ ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశంలో నాయకులు ఆర్. ఎన్. రాజా, స్వామినాథం,గుర్రప్ప, సుబ్బారావు, బాబు, గంగులయ్య, కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు రేషన్ పంపిణీ

పోరుమామిళ్ల : మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటి యజమాని మంచానికి పరిమితమైన 70 కుటుంబాలకు ప్రతినెలా రూ. వెయ్యి విలువ చేసే రేషన్ కిట్లను అందజేస్తున్నామని మదర్ తెరిసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, గిరి ప్రణీత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా అందిస్తున్న కార్యక్రమంలో భాగంగా సిద్ధవరం పంచాయతీ దళితవాడకు చెందిన ముండ్లపాటి శేఖర్‌కు పక్షవాతం, ముండ్లపాటి చిన్నయ్యకు దీర్ఘకాల వ్యాధుల వల్ల ఒక కాలు పూర్తిగా తీసేయడంతో ఇబ్బందులు పడుతున్నారని. వారి ఇబ్బందులను గుర్తించి సంస్థ తరపున రేషన్ అందజేశామని ఇకపై ప్రతినెల వారికి అందజేస్తామని తెలిపారు. ప్రతినెల మొదటి వారంలో కార్యక్రమంలో రామ్మోహన్ రెడ్డి, కావేటి నాగరాజు, మురళి, సాగర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

రైతు సమస్యలను వదిలేసిన గత పాలకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గత పాలకులు రైతు సమస్యలను పూర్తిగా విస్మరించారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. మైలవరం నుండి వచ్చే కాలువ గత ప్రభుత్వాలు 18 ఏళ్ల నుండి పూడిక తీయకపోవడం వల్ల 8 గ్రామాల రైతులకు దాదాపు 5800 ఎకరాల పొలాలకు నీరు అందడం లేదనే విషయం తెలుసుకున్నానని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులతో మాట్లాడి సోమవారం పూడికతీత పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యే రాచమల్లుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రైతుల అన్ని సమస్యలను పరిష్కరించిందన్నారు. రైతును రాజును చేసిందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఎన్నికల్లో వైసిపిని ఓడించాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానికంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం వాతల ప్రభుత్వంగా మారిందన్నారు. జగన్ బాదుడురెడ్డిగా మారినట్లు ఎద్దేవా చేశారు. ధరలు, ఛార్జీలు, పన్నులు పెంచడం ద్వారా జగన్ ప్రభుత్వం ప్రజలకు భూలోకంలో యమలోకం చూపిస్తున్నట్లు వివరించారు. పెట్రోలు, డీజిల్‌పై అదనపు వ్యాట్, రోడ్డు సెస్సు విధించడం ద్వారా వాటి ధరలు దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. కర్ణాటక, తమిళ నాడుతోపాటు ఇతర రాష్ట్రాల కంటే రూ.10 ఎక్కువగా ఉందని తెలిపారు.

ప్రజలకు సౌకర్యంగా వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కడప రోడ్డులో ఆర్అండ్‌బి రోడ్డుపై నిర్మిస్తున్న నేషనల్ హైవే బ్రిడ్జిని ఇరుకు కంతగా కాకుండా ప్రజలకు సౌకర్యంగా ఉండేలా నిర్మిం చాలని రైతు నాయకులు ఎవి రమణ కోరారు. ఆ మేరకు ఆయన సోమవారం రైతు సంఘం సభ్యులు, ప్రజా సంఘాలతో కలిసి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం రమణ మాట్లాడుతూ మైదుకూరు పట్టణంలోని నాలుగు రోడ్ల సెంటర్ నుండి కడప రోడ్డులో నుంచి కర్నూల్-కడప బైపాస్ రోడ్డు వరకు నాలుగు లైన్ల రహదారిగా రూ.19.50 కోట్లతో మంజూరైందన్నారు. అయితే ప్రస్తుతం ప్రొద్దుటూరు రోడ్డు నుండి బద్వేల్ రోడ్డు వరకు నిర్మిస్తున్న దారిలో కడప రోడ్డులో బ్రిడ్జిని కేవలం 7 మీటర్ల ఇరుకు బ్రిడ్జిగా నిర్మాణానికి పనులు ప్రారంభించారని తెలిపారు. అలా కాకుండా పది మీటర్ల కంతగా నిర్మాణం జరిపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అలా చేయకపోతే తమ ఆధ్వర్యంలో మైదుకూరు నియోజకవర్గంలోని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని నిర్మాణాన్ని అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు లక్ష్మమయ్య, దండు వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ, పౌర హక్కుల సంఘం నాయకులు కాశీ పాల్గొన్నారు.

ఘనంగా 'పోరెడ్డి' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వరరెడ్డి పుట్టినరోజు వేడు కలను సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, పోరెడ్డి అభిమానులు కేక్ కట్ చేసి, బాణసంచా పేల్చారు. ఈ సందర్భంగా పోరెడ్డి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వేపరాల ఎంపిటిసి అలిశెట్టి కుమార్, గొనిగనూరు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు దూదేకుల కులాయిబాషా, శివారెడ్డి, విజయ్, బేపారి షామీర్ అలీ, చంద్రఓబుల్ రెడ్డి, సుధాకర్, అన్సర్ పాల్గొన్నారు.

'పోరెడ్డి'కి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

రేపు చలో విజయవాడ

ఎర్రగుంట్ల : సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న విజయవాడలో బహిరంగసభ నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్ పిలుపునిచ్చారు. స్థానిక నాలుగురోడ్ల కూడలిలో సిపిఎం బహిరంగ సభ గోడపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రామయ్య, అమీర్, ప్రసాదరెడ్డి, వల్లి, రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ : ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-కమలాపురం

వైఎస్ఆర్ జిల్లా కమలాపురం మండలంలోని పందిళ్ళపల్లె గ్రామ సమీపంలో కడప-తాడిపత్రి జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో యోహాన్(31) అతని బావమరిది మహేష్(29) మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు... ప్రకాశం జిల్లా పొన్న లూరు మండలానికి చెందిన వారిద్దరూ తాపీ మేస్త్రీలుగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఏడాది క్రితం తమ కుటుంబాలతో కలిసి మండలంలోని నల్లింగాయపల్లిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టుకు తీసుకొని కొంతమంది కూలీలను పెట్టుకుని ఇల్లు నిర్మిస్తూ జీవనం సాగిస్తూ ఉండేవారు. ఆదివారం అర్ధరాత్రి తెల్లవారుజామున నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో ఆ పనులను ముగించుకొని ఇంటికి చేరుకున్నారు తినడానికి ఏమైనా తీసుకొస్తామని, వాహనానికి పెట్రోల్ పట్టించుకుని వస్తామని వాహనంలో బావ బామ్మర్దులు పందిళ్లపల్లెకు బయలుదేరారు. హోటల్లో ఇద్దరు భోజనం తిని పెట్రోల్ పట్టించుకునేందుకు రోడ్డు దాటుతుండగా ఎర్రగుంట్ల వైపు నుంచి కడపకు వెళ్లే లారీ అతివేగంగా వచ్చి చక్రవాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం కడప సర్వజన ఆస్పత్రికి తరలించారు. యోహాన్‌కు భార్య విశ్వేశ్వరమ్మ, చిన్న వయసుగల కుమారుడు, కుమార్తె ఉన్నారు. మహేష్‌కు భార్య బుజ్జమ్మ, ముగ్గురు చిన్న వయసుగల కుమారులు ఉన్నారు.

లారీ కింద నుజ్జునుజ్జయిన బైక్

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లో బి.విజయలక్ష్మి (55) అనే మహిళ సోమవారం సాయంత్రం నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తన తండ్రి, కొడుకుతో కలిసి శ్రీశ్రీ నగర్‌లోని తన సొంత ఇంట్లో ఉంటున్నారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇల్లు మొత్తం మంటలు వ్యాపించడంతో వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు ఆర్పారు. ఇల్లంతా పొగతో నిండిపోవడంతో మృతదేహాన్ని బయటకు తీసేందుకు సిబ్బంది సిబ్బంది చాలా సేపు శ్రమించారు. ఆరోగ్య సమస్యలే కారణమని విజయలక్ష్మి కొడుకు సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు.

బి.విజయలక్ష్మి(ఫైల్‌ఫోటో)

కుక్కలున్నాయి జాగ్రత్త..!

చిన్నారులు, పాదచారులను వెంబడిస్తున్న వైనం - పలువురికి గాయాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డా వీధి, గూడు మస్తాన్ వలీ దర్గా వీధి, బ్యాంకు కాలనీ, దిగువపట్నం కాలనీ, నెహ్రూ నగర్ కాలనీ, ఎస్‌పిజి క్వార్టర్స్, గంగమ్మ దేవాలయం వెనుక భాగాన ఉన్న వీధుల్లో, బెల్లాల వీధిలో వీధి కుక్కలు, పిచ్చికుక్కలు ఎక్కడపడితే అక్కడ గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల గుంపు వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. వాటిని తరిమేందుకు ప్రయత్నించిన ప్రజలపై, దారిలో సైకిళ్లు, స్కూటర్లపై వెళతున్న వారిపై, పాదచారులను వెంటాడుతూ కరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల జమ్మలమడుగు మున్సిపాలిటీలోని బేపారి వీధి, గడ్డా వీధి, గూడు మస్తాన్ వలి దర్గా వీధుల్లో దాదాపు 10-15 మంది పిల్లలను వీధి కుక్కలు, పిచ్చి కుక్కలు వెంటపడి మరీ గాయపరిచాయి. దీంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రయివేట్ వైద్య శాలల్లో గాయపడిన చిన్నారులను తీసుకొని వారి తల్లి దండ్రులు గుంపులుగా వచ్చారు. ఈ కుక్కల దాడులను తట్టుకోలేక ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి జమ్మలమడుగు పట్టణంలోని అన్ని వీధుల్లో వీధి కుక్కలు, పిచ్చి కుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.

పట్టణంలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు, కుక్కకాటు వేయడంతో పడిన గాట్లు(ఫైల్‌ఫోటో)

కిడ్నీ బాగుంటేనే ఆరోగ్యం

- కిడ్నీ చికిత్స నిపుణులు డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మనిషి శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీస్) చాలా ముఖ్యమైన అవయవాలు. మనిషి మనుగడకు మెదడు, గుండె, మూత్రపిండాలు మూలాధారం. అంతటి ప్రాధాన్యత కలిగిన కిడ్నీల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. తద్వారా ఆరోగ్యంగా ఉండాలని ప్రముఖ కిడ్నీ చికిత్స నిపుణులు డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మూత్రపిండాల అవగాహనా దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. మనిషి చేసే కార్యకలాపాలాన్నింటినీ నియంత్రించేందుకు మెదడుతోపాటు శరీరంలోని అన్ని అవయవాలకు రక్తాన్ని ప్రసరింపజేసేందుకు పంప్ వంటి సాధనం గుండె అన్నారు. రక్తంలో చేరుతున్న కల్మషాన్ని(చెడు) గాలించి వడపోసి శుభ్రం చేసే పని మూత్రపిండాలది. మూత్రపిండాలు విరామం లేకుండా పనిచేసి రక్తాన్ని శుభ్రం చేస్తుంటాయన్నారు. ఒక రోజులో మనిషి మూత్రపిండాలు 200లీటర్ల రక్తాన్ని వడ బోస్తాయని అంచనా. ఒంట్లో నీరు-లవణాల సమ తుల్యతను కాపాడడంలో, రక్తపోటును నియంత్రించడంలో ముఖ్య మైన పాత్ర పోషిస్తాయన్నారు. మనం తినే ఆహారం నుండి అనవసరమైన పదార్థాలు కొన్ని రక్తంలో చేరుతాయని వీటినే మలినాలు అంటా మన్నారు. ఇలా రక్తంలో చేరిన మలినాలను కిడ్నీలు శరీరం నుండి బహిష్కరించకపోతే రక్తం విషపూరితం అవుతుంది. ఈ పనిని కిడ్నీలు చేస్తా యన్నారు. మూత్రపిండాలు దెబ్బతినేందుకు నియంత్రణలోలేని మధుమేహం, అధికరక్తపోటు, ఉబకాయం, సైడ్ ఎఫెక్ట్స్ తెచ్చే పెయిన్ కిల్లర్స్ కొంత వరకు వంశపారంపర్యం వంటివి కారణాలుగా ఆయన వివరించారు. అధికంగా వాంతులు, విరేచనాలు అవుతూ ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలన్నారు. అధికంగా మాంసం తినడం వల్ల, వేడి వాతావరణంలో పని చేయడంవల్ల, ఫ్లోరైడ్ సహిత నీళు తాగడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడుతాయన్నారు. రోజుకు 5 నుండి 7లీటర్ల నీరు తాగితే రాళ్లు ఏర్పడే అవకాశం ఉండదని ఆయన సూచించారు. అతిమూత్రం నీరసం, కాళ్లవాపు, నడుంనొప్పి లక్షణాలుగా తెలిపారు. క్రమం తప్పని వ్యాయామం, శరీర బరువును అదుపులో పెట్టుకోవడం, పొగాకు ఉత్పత్తులను వాడకపోవడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి అలవాట్లతో మూత్రపిండాల వ్యాధి నుండి దూరం కావచ్చని డాక్టర్ కృష్ణారెడ్డి సూచించారు.

టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్ నేతృత్వంలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశానంతరం ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసలరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఇతర నాయకులు ప్రవీణ్ నివాసానికి రావడంతో పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు చేరుకున్నారు. సంయమనం పాటించాలని ప్రవీణ్ కార్యకర్తలకు సూచించారు. ప్రవీణ్‌రెడ్డితోపాటు టిడిపి నాయకులు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. స్టేషన్ ముందు ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ అక్రమ అరెస్టులో నిర్దోషిగా బయటకు వస్తానని తెలిపారు. 2024 ఎన్నికల్లో రాచమల్లుకే టికెట్ రావాలని కోరుకుంటున్నానని, ప్రజాక్షేత్రంలోనే నువ్వో, నేనో తేల్చుకుందామన్నారు. గత నెలలో వైసిపి వర్గీయుడు బెనర్జీపై ప్రొద్దుటూరు టిడిపి యువత అధ్యక్షుడు భరత్ కుమార్ రెడ్డి, ప్రవీణ్ సమీప బంధువు రామ్మోహన్‌రెడ్డి చేసిన హత్యాయత్నంలో ప్రవీణ్‌రెడ్డిపై 307, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఇంతవరకు ఆయన పరారీలో ఉండడంతో సోమవారం అరెస్టు చేశారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు పూర్తయిన వెంటనే మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని డిఎస్‌పి వంశీధర్ గౌడ్ తెలిపారు.

అరెస్టు సమయంలో పోలీసులతో మాట్లాడుతున్న ప్రవీణ్

ప్రవీణ్‌కు 14 రోజుల రిమాండ్

ప్రొద్దుటూరు : గత నెల 28న బెనర్జీపై జరిగిన హత్యాయత్నం కేసులో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి న్యాయమూర్తి 14రోజులపాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. ఈ కేసులో ఎ3గా ఉన్న ప్రవీణ్ సోమవారం స్వచ్ఛందంగా త్రీటౌన్ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

ఎలా బయటపడాలో మాకు తెలుసు


మాట్లాడుతున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అక్రమ కేసుల్లో ఎలా బయటపడాలో తమకు తెలుసని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి నివాసంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బెనర్జీపై దాడి కేసులో ప్రవీణ్ కుమార్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కావాలనే ఎమ్మెల్యే రాచమల్లు అక్రమ కేసులు పెట్టి ఆయనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి అక్రమ కేసులు ఎలా ఎదుర్కోవాలో తమకు కూడా తెలుసన్నారు. జిల్లాలో ఏ నియోజకవర్గంలో కూడా ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించే ఆనవాయితీ లేదన్నారు. ఒక్క ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాత్రమే కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రవీణ్ ఎమ్మెల్యే చేసే ప్రతి అక్రమ పనికి అడ్డు తగులుతూ ఉండడంతో ఓటమి భయంతోనే అక్రమ కేసులు బనాయి స్తున్నారన్నారు. అనంతరం ప్రవీణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భరత్ తమ్ముడు లాంటి వాడని, రామ్మోహన్ తన బంధువని ఇరువురు టిడిపిలో ఉన్నారన్నారు. భరత్ బెనర్జీని గాయపరచడం యాధృచ్ఛికమన్నారు. ఇది ఆత్మ రక్షణ కోసం జరిగిన దాడి అని తెలిపారు. ఉద్దేశ్యపూర్వకంగానే తనపై తప్పుడు కేసులు ఎమ్మెల్యే పెడుతున్నారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తి లేదన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో బెనర్జీ నిందితుడని, గతంలో వైసిపి నాయకులను బెదిరించాడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవ గుడి నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, బండి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణ జలాల కేటాయింపులో తీరని అన్యాయం

- కేంద్రం చేసిన చట్టంతో 'సీమ' ఎడారి : విరసం వరలక్ష్మి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ లబ్ధి కోసం అక్టోబర్ 2న ఒక చీకటి చట్టాన్ని తీసుకొచ్చాయని, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కృష్ణ జలాల కేటాయింపులో తీరని నష్టం చేకూరే ప్రమాదం ఉందని విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి తెలిపారు. సృజన సామాజిక కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీమను ఎడారి చేసే చీకటి చట్టం పేర రాయలసీమ విద్యావంతులు వేదిక వేసిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా రాయలసీమకు చాలా అన్యాయం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నీటిని ప్రాజెక్టుల వారీగా కాకుండా ఏక మొత్తంగా తీసుకొని రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి పంపకం చేయాలనే అంశాన్ని బ్రిజేష్‌కుమార్ మిశ్రాకు అప్పగించారన్నారు. గోదావరి జలాలను పోలవరం ద్వారా కృష్ణ డెల్టాకు మళ్లించడం ద్వారా ఆదా అయ్యే కృష్ణ జలాలను రెండు తెలుగు రాష్ట్రాల అవసరాలకు పంచే అంశాన్ని రాజేష్‌కుమార్‌కు కేంద్రం అప్పజెప్పిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భవిష్యత్తులో గోదావరి జలాలను కృష్ణ నదికి మళ్లించడం ద్వారా ఆదా అయ్యే జలాలను రెండు రాష్ట్రాలకు పంచాలన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం తమ ప్రాంతంలోని కృష్ణ నది మీద ఆధారపడిన ప్రాజెక్టులకు గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఆదా అయ్యే కృష్ణ జలాలను రెండు రాష్ట్రాలకు పంచే అంశం మాత్రం ఈ చట్టంలో చేర్చలేదన్నారు. తద్వారా రాయలసీమకు ఉన్న మిగులు జలాల మీద ఆధారపడిన ప్రాజెక్టులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తూ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా పోరాడాలసిన ఆవశ్యకత ఉందన్నారు. కరపత్రాలు పట్టణంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక కో-కన్వీనర్ ఎస్వీ మహమూద్, సృజన సామాజిక వేదిక శ్రీనివాసులురెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు తవ్వా సురేష్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఆర్వీఎస్ కన్వీనర్ హరిత, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న వరలక్ష్మి, తవ్వా సురేష్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు 56వ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ అధికారి జె శివశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ఉద్యమకారులకు నివాళులర్పించడం, 17న విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. హార్మోనియంపై సంగీతంలోని సరిగమలు నేర్పిస్తామన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముగింపు రోజున పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైఎస్ఆర్ జిల్లాలోని అన్ని మండలాలను కరువుగా ప్రకటించి, ఉపాధి పనులు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని ఆయన తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను గత 2-3 నెలలుగా రైతు సమస్యలు, కరువు పరిస్థితులపై మాట్లాడుతూ మైలవరం ఇంజనీర్లను సంప్రదించానని తెలిపారు. నీరు వదలాలని కోరానని అన్నారు. అయితే ఎమ్మెల్యే రాచమల్లు మాత్రం గత 4 రోజుల క్రితం రాజుపాలెం మండలానికి వెళ్లి కాలువలలో పూడికతీత పనులు చేయించి తానే అధికారులతో మాట్లాడి కెసి కెనాల్, మైలవరం కాలువల నుండి నీరు వదిలించినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిఎంతోపాటు ఎమ్మెల్యేలకు ధనార్జనే తప్ప.. రైతు, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడంలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ బాల వెంకట కొండయ్య, మాజీ టిడిపి పట్టణాధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ శివాలయం పాలకమండలి ఛైర్మన్ పల్లా శంకర్ నారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

సిఎం జిల్లా పర్యటనతో ఒరిగిందేమీలేదు

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండు రోజుల జిల్లా పర్యటనలో పులివెందుల ప్రజలకు ఒరిగిందేమీలేదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కరువుపై అధికారులతో సమీక్షించలేదన్నారు. ఈ ఏడాది వర్షాలు లేక పంటలు ఎండిపోయి తీవ్ర కరువు పరిస్థితి ఏర్పడిందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రధానమంత్రి పసల బీమా వల్ల రైతులకు మేలు జరిగేదని, ఆ పథకాన్ని వైఎస్ఆర్ బీమాకు మార్చి పంట వేసిన వారికి మాత్రమే బీమా సౌకర్యం కల్పించేలా చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెద్దరంగాపురం గ్రామానికి చెందిన జేఎన్టీయూ, ఏపీ కార్ల తదితర వాటికి భూములు ఇచ్చారని, వారికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు పార్లమెంటు సభ్యులు, పదిమంది శాసన సభ్యులు ఉన్నా ఈ ప్రాంత సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లకపోవడం చాలా దారుణమన్నారు.

రైతుల పరిస్థితి పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

కరువుతో అల్లాడుతున్న రైతులను వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందిపల్లె, కత్తులూరు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షుడు రామ గంగిరెడ్డి, నిమ్మకాయల దర్బార్, తెలంగాణ వలి, శ్రీరాంరెడ్డి, గంగిరెడ్డి, కత్తులూరు మల్లికార్జున, గణేష్ నాయక్, పాములూరు చంటి, ముత్తుకూరు లక్ష్మి నారాయణ, ఆర్‌వి రమేష్, వీరబద్ర, ఈశ్వరయ్య, పీరా సాహెబ్, గొటూరు నాగభూషణం, అల్లాబకష్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ముద్దనూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్, ఎస్వీగిరి కాలనీలో ఆదివారం భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, టిడిపి యూత్ వినోద్, ఓబులేసు, దానమయ్య, కర్ణ, పృథ్వీ, రామాంజనేయులు, ప్రదీప్, చైతన్య, హరి, కిషోర్, బద్రి, నవీన్, శ్రీనాథ్, శివ, వరద, రాఘవ, మల్లికార్జున, నాగార్జున, గణపతి, అర్జున్, పునీత్, ప్రసాద్, చిన్న, వంశీ, సుధాకర్, బాబు, వీరేష్, శివమణి, టోనీ, అభినయ్, కిరణ్ పాల్గొన్నారు.

వెయ్యికిపైగా అవధానాలు చేసిన సివి సుబ్బన్న

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరుకు చెందిన సివి సుబ్బన్న వెయ్యికిపైగా అవధానులు నిర్వహించి అవధాన పితామహులుగా పేరుగాంచారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ రచయిత జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సోమవారం సివి సుబ్బన్న జయంతి వేడుకలు నిర్వహించారు. సుబ్బన్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 47 సంవత్సరాల్లో సుబ్బన్న 1000కిపైగా అవధానులు నిర్వహించారన్నారు. అవధాన విద్యపై మైసూరు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారన్నారు. అవధాన విద్య గురించి వీరు రచించిన గ్రంధాన్ని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు ప్రచురించారన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ కళాశాల అధ్యాపకులు కూరపాటి శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు కోటా ఓబులరెడ్డి, రాష్ట్ర భాషా ఉపాధ్యాయ సంస్థ కోశాధికారి భోగా గంగాధర్, సాహితీప్రియులు హరికిరణ్ పాల్గొన్నారు.

సివి సుబ్బన్నకు నివాళులర్పిస్తున సాహితీ అభిమానులు

మోయడానికి మేం ఉన్నాం..

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మండలంలోని మోరగుడి గ్రామానికి చెందిన గుద్దేటి యానాది (78) అనే అనాథ మృతదేహానికి సోమవారం మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. యానాది అంతిమ సంస్కరణలు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో తాము స్పందించామని ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు తెలిపారు. భార్గవ్ సాయి, రాజశేఖర్, సుమన్ బాబు, శ్రీరామ్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమ శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సాయం చేయదలచిన దాతలు 90008 79801, 82972 53484 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE HON'BLE 1st ADDITIONAL DISTRICT JUDGE: KADAPA
I.A.NO.492 of 2022
in O.S.No.16 of 2013

Between

Smt. Ganjikunta Jayamma, wife of Pedda Subba Reddy, Hindu, aged 71 years, Housewife, residing in kanapalli village, Khaderbadar Post, Proddatur Mandal, Kadapa District.

..Petitioner/Plaintiff

Vs

And

Kandula Ashok kumar Reddy, Son of Kandula Krishna Reddy, Hindu, aged about 33 years, resident of D.No. 6/50, D. Kotha pallivillage, Valluru Mandal, Kadapa District.

... Respondent/Proposed Party No.22

NOTICE TO RESPONDENT/PROPOSED PARTIEY No.22.

please take notice that the petitioner/ plaintiff has filed the above I.A., against you to add proposed party as Defendant Nos.22 in the above suit and to all other incidental proceedings pending here with, and the above I.A., standes posted for your appearance either personally or through advocate, at **10.30 A.M. on 30.11.2023** before the said court and if you fail to appear, matter will be decided ex-parte.

//By order of the Court//

SRI.M. SURESH KUMAR, M.A.B.L
Advocate for the Petitioners-Plaintiffs,
Kadapa City, A.P